క్లుప్తంగా

కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసీపీ గిరిప్రసాద్

కమాన్‌పూర్: మండల పోలీస్‌స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ సోమవారం తనిఖీ చేసి స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి వారి నుంచి పిటిషన్లు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏసీపీ వెంట గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై షేక్‌మస్తాన్ ఉన్నారు.

రష్మీ ఠాగూర్‌కు ఉమెన్స్ అచీవర్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రష్మీ ఠాగూర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన రష్మీ ఠాగూర్ ఫ్యాషన్ విభాగంలో ఉమెన్స్ అచీవర్స్ అవార్డు–2023 అందుకుంది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని హోటల్ గ్రీన్ పార్కులో అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. తెలంగాణ హైకోర్ట్ జస్టిస్ శ్రీ సుధ, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామగుండం: ఇటీవల వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సోమవారం సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్తంగా అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు మేర్గు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, వేల్పుల సాంబయ్య, రాజకొమురయ్య తదితరులున్నారు.

దెబ్బతిన్న రేకుల షెడ్లు పరిశీలన

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రి నగర్‌లో రాళ్ల వానకు దెబ్బతిన్న రేకుల షెడ్లను మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత సోమవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ తిరుపతి స్థానిక నాయకులు ఉన్నారు.

బాధితులకు నష్ట పరిహారం అందించాలి

సుల్తానాబాద్: నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్ కోరారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సుమారు 200 ఇండ్ల రేకుల షెడ్లు పగిలిపోయాయని రెవెన్యూ అధికారులు పరిశీలించి బాధితులకు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వెంటనే బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు తోట మధు పటేల్, బీఎస్పీ నాయకులు అల్లెపు చంద్రశేఖర్, ప్రదీప్, కమ్మ రాకేశ్, దేషెట్టి సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌ కో కన్వీనర్ల నియామకం

గోదావరిఖనిటౌన్: రామగుండం మున్సిపల్ ఏరియా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్‌గా గుండ్ల రాకేశ్, కో కన్వీనర్‌గా కన్నూరి రాజ్‌కుమార్‌లను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంథని సామేల్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్, నాయకులు కాసిపేట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడులో 3,468 ఎకరాల్లో నష్టం

- వ్యవసాయ అధికారుల ప్రాథమిక అంచనా
- పంట నష్టం వివరాలు నమోదు


ర్యాకల్‌దేవుపల్లిలో నేలవాలిన మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న ఏవో ఉమాపతి, ఎంపీపీ స్రవంతి



ఎలిగేడులో కూరగాయల పంటలను పరిశీలిస్తున్న అధికారులు, రాలిన మామిడి పిందెలు పరిశీలన

ఎలిగేడు: ఆదివారం కురిసిన వడగండ్ల వర్షానికి ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలు పెద్దమొత్తంలో దెబ్బతిన్నాయి. సోమవారం మండలంలోని లాలపల్లిలో ఏడీఏ ఆదిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి, ఏవో ఉమాపతి పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో ఏఈవోలు పంటలను పరిశీలించారు. పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తంగా వరి, మొక్కజొన్న, బీర, క్యాబేజీ, టమాటో, మిర్చి, మామిడి కలిపి దాదాపు 3500 ఎకరాల్లో నష్టం వాట్లిందని అధికారులు గుర్తించారు. వరి 3,318 ఎకరాలు, మొక్కజొన్న 75, మామిడి 60, కూరగాయలు 15ఎకరాల్లో నష్టపోయినట్లు ఏవో ఉమాపతి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

508 ఇంటి పైకప్పు రేకులు డ్యామేజీ

వడగండ్ల వానకు 508 ఇళ్ల పైకప్పు రేకులు ధ్వంసమైనట్లు తహసీల్దార్ నాగరాజమ్మ తెలిపారు. ఎలిగేడులో 28, లాలపల్లిలో 27, నారాయణపల్లిలో 81, నర్సాపూర్‌లో 50, సుల్తాన్‌పూర్‌లో 150, రాములపల్లి, ర్యాకల్‌దేవుపల్లిలో 151, శివుపల్లిలో 21ఇళ్ల ఇంటి పైకప్పు రేకులు పాక్షికంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

సుల్తానాబాద్‌లో వరి పొలాల పరిశీలన

సుల్తానాబాద్: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్లు ఏడీఏ ఆదిరెడ్డి తెలిపారు. పూసాలలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సర్వే చేసి నివేదిక అందివ్వాలని సూచించినట్లు తెలిపారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు బోయిని రాజమల్లయ్య, కౌన్సిలర్లు గుర్రాల శ్రీనివాస్, తిరుపతి, రైతులు ఉన్నారు.

నూకాంబిక పోచమ్మకు పుష్పాభిషేకం


పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని బర్మా, కాందిశీకుల ఆరాధ్యదైవం శ్రీనూకాంబిక పోచమ్మకు సోమవారం మాలాధారణ స్వాములు లక్ష పూలతో పుష్పార్చన చేసి తమ భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. కాగా వేడుకలు నేటితో ముగియనుండడంతో మాలాధారణ స్వాములు ముగింపు పూజలకు సిద్ధమవుతున్నారు. ఈ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు పర్యవేక్షిస్తున్నారు.

జాతరకు రావాలని సీఐకి ఆహ్వానం

అంతర్గాం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే శ్రీనూకాంబిక పోచమ్మ జాతర వేడుకలకు రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌ను కలిసి ఉత్సవ కమిటీ ప్రతినిధి మోహన్‌రావు ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీటీఎస్ అంతర్గాం ఉప సర్పంచ్ పెరుమాళ్ల శశికుమార్, ఇండిబిల్లి రవీందర్, శోభన్‌బాబు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో మాసశివరాత్రి పురస్కరించుకుని సోమవారం ఆలయ గర్భగుడిలో విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం పరిరక్షించాలని, నూతన విద్యుత్‌కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి జాగటి శ్రీకాంత్, పల్లెర్ల ఆంజనేయులు, పాత రాజయ్య, కట్కూరి ఆత్మలింగం, తాటిపెల్లి శివప్రసాద్ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీల ధ్యేయం


మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ఓదెల: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీలు పనిచేస్తున్నాయని పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పొత్కపల్లి సొసైటీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రైతులకు అందుబాటులో ఉంటూ పంట రుణాలతో పాటు ఎరువులను అందజేస్తున్నట్లు తెలిపారు. రూ.70 లక్షలతో సొసైటీ పక్కాభవనం, గోదాముల నిర్మాణం జరుగుతున్నాయని, వాటిని త్వరలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, సీఈవో గోళి అంజిరెడ్డి, సీనియర్ ఆడిటర్ సురేందర్, వైస్ చైర్మన్ మద్దెల కమలనర్సయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలోనూ ముందుండాలని గాయత్రీ విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో వారం రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేకశిబిరం ముగింపు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణప్రాంతాల్లో ఉన్న నిరక్షరాసుల్లో చైతన్యం పెంచేందుకు పాటుపడ్డ వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్, పర్యావరణ పరిరక్షకుడు శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆఫీసర్ సమద్, అధ్యాపకుడు రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులున్నారు.

లొంకకేసారంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

రామగిరి: మండలంలోని లొంకకేసారంలో సెంటినరీకాలనీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు స్వచ్ఛ భారత్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఒజ్జ ఒదెలు, పంచాయతీ కార్యదర్శి అమల, కళాశాల సీనియర్ అసిస్టెంట్ కె. వంశీ కృష్ణ గౌడ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు యోగా శిక్షణ


శిక్షణ పొందుతున్న పీడీ, పీఈటీలు

సుల్తానాబాద్‌రూరల్: జిల్లాలో ప్రభుత్వ, కస్తూర్బా, మోడల్, గురుకులల్లో పని చేస్తున్న పీడీ, పీఈటీలకు సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 5 రోజుల వరకు యోగాభ్యాసనపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో సురేందర్ తెలిపారు. ఈ శిక్షణను అరుణ యోగా సంస్థ, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహిస్తుండగా సోమవారం ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవీలత, యోగా శిక్షకులు హర్ష, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ హేళ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే బీసీ రిజర్వేషన్లు సాధిద్దాం


రిలే దీక్షలో బీసీ సంక్షేమసంఘ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీలంతా ఏకమై ఐక్యంగా పోరాడితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులపై ఒత్తిడి పెంచి రిజర్వేషన్లు సాధించుకోవచ్చని బీసీ సంక్షేమసంఘ డివిజన్ అధ్యక్షుడు, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వైస్ చైర్మన్ నూనె రాజేశం అన్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష ఆధ్వర్యంలో 54 రోజులుగా సాగుతున్న రిలే దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. బీసీ గణన చేపట్టాలని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షలో ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల శంకర్, నాయకులు రాజేందర్, రజిత, రమ, మౌనిక, స్రవంతి, భూలక్ష్మి, భాగ్య, సరళ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

రామగిరి: ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సోమవారం సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు మంథని ఆర్డీవో వీర బ్రహ్మచారి సందర్శించి తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్, కమ్యూనిటీ హెల్త్ పరీక్షకు 204 మంది విద్యార్థులకు గాను 194 మంది విద్యార్థులు హాజరు కాగా, 10 మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. సీఎస్‌గా డీఎల్ఎన్ రావు, డీవోగా శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు.

పేపర్ల లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


నిరాహార దీక్షలో బీజేపీ నాయకులు

గోదావరిఖని: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు సోమారపు లావణ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ మంత్రులు, నాయకులకు కేంద్రం మీద ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌మీద లేదన్నారు. అసమర్థ పాలనలో ఇంకెన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందోనని ఎద్దేవా చేశారు. పేపర్‌లీకేజీకి బాధ్యులైన వారిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సోమారపు అరుణ్‌కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి మల్లికార్జున్, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు కుసుమ, మాతంగి రేణుక, పిడుగు కృష్ణ, బద్రి దేవేందర్, కార్పొరేటర్లు కిషన్‌రెడ్డి, దుబాసి లలిత, మాడ నారాయణరెడ్డి, పత్తి సంజీవ్, దాసరి శ్రీనివాస్, జనగామ రాజలింగు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలో సోమవారం దీక్ష చేపట్టారు. నాయకులు వునుకొండ శ్రీధర్‌పటేల్, ప్రమోద్‌రావు, రాజవీరు, మనోహర్, భూమయ్య, తిరుపతి, శ్రీనివాస్, కరుణాకర్, ఫయాజ్, సంపత్‌చారి, శ్రీధర్, రమేశ్, ప్రశాంత్, రవితేజ, బాలు, రజనీకర్‌రెడ్డి, రాజేశం తదితరులున్నారు.

పేపర్ల లీక్ పై బీజేపీ నిరసన దీక్ష

మంథని: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంథనిలో సోమవారం బీజేపీ నాయకులు స్థానిక ప్రధాన చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టారు. పేపర్ లీకేజీలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు దీక్షలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, ప్రధాన కార్యదర్శి సబ్బని సంతోష్, బూత్ సశక్తి కరన్ అభియాన్ నియోజకవర్గ ఇన్‌చార్జీ చిలువేరు సతీష్, నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ ఘటన పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిగిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, నాయకులు మచ్చగిరి రాము,అరుణ్‌కుమార్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

రామగిరి: ముత్తారం మండలంలో కురుస్తున్న అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం మండల హార్టీకల్చర్ అధికారి(ఎంహెచ్‌వో)శ్రీకాంత్ పరిశీలించారు. మండలంలోని హరిపురం, మైదంబండ గ్రామాల్లోని పసుపు పంటలను, మండలంలోని ముత్తారం, ఓడేడ్, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి గ్రామాల్లోని మిర్చి పంటలు పరిశీలించారు.ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ముత్తారం: మండల పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వడగళ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకోజు అశోక్, తోడేటి శశి కుమార్, దామ శ్రవణ్, రైతులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రామగిరి: మండలంలోని రత్నాపూర్ పంచాయతీ పరిధిలోని 7వ వార్డు(బేగంపేట్ క్రాస్ రోడ్డు)లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ లో మంజూరైన రూ.3 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుబ్బాక సత్యారెడ్డి, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యుడు వేగోళపు మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి పెండ్లి రమ్య, నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు వెళ్లే దారిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం సర్పంచ్ నీలం సరిత ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మ్మల్లు, ఉప సర్పంచ్ బొజ్జ సాగర్, వార్డు సభ్యులు రవి, అజయ్ పాల్గొన్నారు.

రుణాలను రెన్యూవెల్ చేయించుకోవాలి

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు వెంటనే రెన్యూవెల్ చేయించుకోవాలని సంఘం సీఈవో సురేశ్ కోరారు.ఎల్‌టీ లోన్లకు ఈ నెల 31 తారీఖు దాటితే అపరాధ వడ్డీ పడుతుందని రైతులు వెంటనే తమ రుణాలను వడ్డి చెల్లించి రెన్యూవెల్ చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి జూలపల్లిలో కంటివెలుగు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో నేటి నుంచి కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్ తెలిపారు. కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

మంథని: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో వచ్చే నెల 5న ఢిల్లీలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ కోరారు. సోమవారం మంథని ప్రధాన చౌరస్తాలో ఛలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ బడి

యైటింక్లయిన్‌కాలనీ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కలిగి ఉన్నాయని రామగిరి మండలం సుందిళ్ల సర్పంచ్ దాసరి లక్ష్మి అన్నారు. మన ఊరు మనబడి కింద సుందిళ్లలోని రెండు పాఠశాలలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ మార్కెట్ చైర్మన్ దాసరి రాజలింగు, హెచ్ఎం రఘు, స్కూల్ కమిటీ చైర్మన్ సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

రామగిరి: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ గంట పద్మ కోరారు. మండలంలోని కల్వచర్లలో సోమవారం నిర్వహించిన మిషన్ అంత్యోదయ గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ వేము కనకయ్య, పాలకవర్గ సభ్యులు బిరుదు భాగ్యలక్ష్మి, భాస్కర్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎంకు సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎంగా పనిచేస్తూ ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కె.నారాయణను సోమవారం ఘనంగా సన్మానించారు. జీడీకే–1 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ సైదులు, మేనేజర్ రమేశ్ బాబు, రక్షణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతర వేలం పాటకు స్పందన

జూలపల్లి: మండల పరిధిలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మీ నర్సింహస్వామి జాతర సందర్భంగా దుకాణాలు నిర్వహించుకునేందుకు సోమవారం నిర్వహించిన వేలం పాటలకు అనూహ్య స్పందన వచ్చింది. లడ్డూ,పులిహోర 1.45 లక్షలు, కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ.90 వేలు, తైబజారుకు రూ.22 వేలు, మొత్తం 2.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సదయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ,ఉపసర్పంచ్ శ్రీనివాస్, శంతన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిని కలిసిన నాయకులు

మంథని: మంథని కేడీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌లో జరుగుతున్న లావాదేవీల్లో అక్రమాలు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు సోమవారం జిల్లా సహకార అధికారి మైకేల్ బోస్‌ను కలిశారు. సమాచార హక్కు చట్టం నుంచి సమాచారం అందించాలని కోరారు. బీజేపీ మంథని పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, నాయకుడు క్రాంతికుమార్ ఉన్నారు.

నేత్ర దాత కుటుంబానికి అభినందన

యైటింక్లయిన్‌కాలనీ: 15వ డివిజన్ తారకరామానగర్‌కు చెందిన కాసర్ల మధు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. సోమవారం వారి ఇంటి వద్ద సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి సంస్మరణ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి బాధిత కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, ఐలి శ్రీనివాస్, రవీందర్, సతీశ్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య కోరారు. సోమవారం ఉద్యమకారులతో కలసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సంగీతకు వినతిపత్రం అందించారు. వచ్చే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఉద్యమకారులను సన్మానించి గౌరవించాలని, ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రకళ, రాజేశం, సుధాకర్, రాజిరెడ్డి, భగవాన్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, గట్టయ్య, మల్లన్న, తిరుపతి, సదాశివ్, సమ్మయ్య, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం


మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

ఓదెల: అకాల వర్షానికి నష్టపోయిన పంటలకు ఎకరానికి ప్రభుత్వం రూ.30 వేలు చెల్లించాలని టీపీసీసీ సభ్యుడు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని పిట్టలఎల్లయ్యపల్లెలో వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి వర్షాలకు నేల మట్టమయ్యాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతురాజ్యంగా చెప్పుకుంటూ పట్టించుకున్న దాఖలేవన్నారు. కార్యక్రమంలో హరిపురం ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు, గ్యారవేని ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.